36

# అందరియందు ఉన్న ఆత్మతత్త్వము ఒక్కటే!

**పాపభీతి లేని పామరత్వము బట్టి**
**దైవప్రీతి లేని దారిబట్టి**
**మానవత్వమణగె మానవులందున**
**విశ్వశాంతి కిదియె విప్లవంబు**

**విద్యార్థులారా!**

అనుభవజ్ఞుడైన, అధికారియైన, అన్ని విధముల దేశమునకు ఆదర్శమును అందిస్తూ అనేకత్వమునందు యేకత్వాన్ని నిరూపణచేస్తూ ఆధ్యాత్మిక మార్గమునందు తన జీవితము నంకితము గావించుకున్న చవాన్ అనేకమైన విషయాలను మీకు తెలుపుతాడని నేను ఆశించాను. కానీ, అతను త్వరలో ముగించి యీయొక్క బాధ్యత నాకందించాడు.

**బుద్ధికి, మనస్సుకు, ఇంద్రియములకు, శరీరమునకు గల నియమిత కర్తవ్యమును గుర్తించాలి**

విద్యార్థులారా! మానవశరీరము ఒక పెద్ద యంత్రాంగము. ఇందులో పెద్ద అధికారిమొదలు చిన్న పనివానివరకు తమ తమ కర్తవ్యములు తాము నిర్వర్తించుకుంటూ పోయినప్పుడు యీయొక్క యంత్రాంగము సార్థకమగుటయేగాక, పవిత్రమగుటయే గాక, దివ్యత్వాన్ని ప్రకటించటంకూడా జరుగుతుంది. ఈ యంత్రాంగమునందు ప్రధానమైన అధికారి బుద్ధి. అతని ఆదర్శాన్ని పురస్కరించుకొనియే రెండవ అధికారి మనసు తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ మనసుకు అధీనమునందున్న workers, వారే యింద్రియములు. ఈ విధమైన పనివారలచేత శరీరమనే యంత్రము తాను నియమిత కర్మలాచరిస్తూ వస్తోంది. ఈ అన్నింటికి రాజైన ఆత్మ ప్రతి అధికారిని ప్రకాశింపచేస్తుంది, వికసింప చేస్తుంది, ప్రకటింపచేస్తుంది, ప్రదర్శింప చేస్తుంది. రాజునకు, ప్రజలకు మధ్యనున్న అధికారియే యీ బుద్ధి. ప్రజాప్రతినిధిగా నిలచి యీ బుద్ధి ప్రజలయొక్క యోగక్షేమములను తాను చూచుకుంటూ ఉంటుంది.

ఐతే, బుద్ధి విచారణ చేస్తుంది. మనసు తలంపులను అభివృద్ధిపరుస్తుంది. కేవలం

srisathyasaivachanamrutam

మనసు తలంపులను అభివృద్ధిపరచినంత మాత్రమున జగత్కళ్యాణము చేకూరదు. మనస్సుకు స్వతంత్రము లేదు. మంత్రియైన బుద్ధిని అనుసరించినప్పుడే యీ మంత్రికి సెక్రటరీగా ఉన్న మనసు సరైన పరిస్థితిని పొందుతుంది. కానీ, కాలానుగుణ్యముగా మధ్యమధ్య మినిష్టరుయొక్క అనుమతి తీసుకోకుండా యీ సెక్రెటరీ కొంచెము ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తాడు. స్వతంత్రాన్ని తీసుకుంటాడు. అప్పుడే పాలనా శక్తి కుంటుపడుతుంది. మానవజీవిత మీనాడు అనేక యిక్కట్లతో, అశాంతులతో, అసంతృప్తితో కుమిలిపోవటానికి మూలకారణము, యీ సన్నిహిత సంబంధ బాంధవ్యమనేది సరిగా జరగటము లేదు. బుద్ధికి, మనస్సుకు, యింద్రియములకు, శరీరమునకు సరియైన నియమిత కర్తవ్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి.

## నిగ్రహశక్తియే లేకుండిన అనుగ్రహము నందుకోలేడు, మానవుడు

ఈ బుద్ధికి యింత అధికారము రావటానికి కారణము యేమిటి? ఆత్మకు అతిసమీపములో ఉండటంచేతనే బుద్ధికి యింత అధికారము లభించింది. ఈ ఆత్మ తత్త్వాన్ని బుద్ధిద్వారా మనసుకు ప్రవేశింపచేసి, తద్వారా యింద్రియములయందు ప్రకటింపచేస్తుంది. ఈ క్రమముయొక్క విధానమునకే 'శమము' అని పేరు. దీనినే 'సంయమ' అని కూడను చెప్పవచ్చును. 'సంయమము' అనగా 'నిగ్రహము'ని అర్థము. ఈ నిగ్రహశక్తియే లేకుండిన అనుగ్రహమునందుకోలేడు, మానవుడు. పశువుగా జీవించటానికి ప్రయత్నించే మానవునికి సంయమము అక్కరలేదు. పరిపూర్ణ మానవునిగా జీవించే మానవునికి సంయమము అత్యవసరము. మానవునకు పశువునకు ఉన్న వ్యత్యాసము యిదియే! పులి క్రూరమృగము. ఈ మృగమునకు పుట్టుకతో వచ్చిన క్రూరత్వము, తిరిగి చచ్చునంతవరకు యేమాత్రము మారదు. క్రూరభావముతో పుట్టిన యీ మృగము క్రూరభావముతోనే మరణిస్తుంది. పిల్లి, మనయిండ్లలో చక్కగా ప్రేమతో పెంచుకుంటూ ఉంటాము. దీనిని యెంతో ప్రేమతో పాలు, పెరుగు, అన్నము పెట్టి పోషించినప్పటికి ఎలుకను చూచిన తక్షణమే ఎగిరి దుముకుతుంది. ఇది పాత అభ్యాసము. ఇది పుట్టుకయొక్క దుర్గుణము. దీనికెన్ని విధములైన ఆహారము పెట్టి పోషించినా ఆ మాలిన్యమువైపుకే దీని మనసు పరుగెడుతుంది. కాని, మానవుడట్టివాడు కాదు. దుష్టుడై, దుర్మార్గుడై, నీచుడై పుట్టిన మానవుడుకూడా సజ్జనుడు, సదాచారుడు, ధర్మస్వరూపుడుగా

మారటానికి అవకాశము ఉంది. సత్సంగముచేతను సద్గ్రంథ పఠనముచేతను, సత్కర్మలు వినటంచేతను తన జీవితాన్ని మార్చుకొని, దివ్యత్వాన్ని పెంపొందింపచేసుకొని, దైవత్వాన్ని అనుభవించటానికి అవకాశము ఉంది. కనుక, మానవునకు సంయమము అనగా నిగ్రహము అత్యవసరము. మృగములుకూడా తాత్కాలికముగా కొన్ని నిగ్రహాలు చేస్తూ ఉంటాయి.

**'బుద్ధిగ్రాహ్య మతీంద్రియం'**

పిల్లలు, మీరు చూచినటువంటిదే! సర్కస్‌లో క్రూరమృగమైన సింహమును తెచ్చిపెట్టి దాని శత్రువైన ఏనుగునుకూడా తెచ్చిపెట్టి రెండింటి సంబంధ బాంధవ్యము ప్రేమతో ఉన్నట్టు నిరూపణ చేస్తారు. అంతేకాదు, చంచలత్వమునకు పుట్టినిల్లు, పెట్టిన పేరు కోతి. అట్టి కోతికి సైకిలు తొక్కించటము నేర్పిస్తారు. సర్కస్‌లో సైకిల్ తొక్కుతుంది. సింహము తన విరోధియైన ఏనుగుతో స్నేహ బంధము యేర్పరచుకుంటుంది. 'ఇవన్నీ అభ్యాసముచేత వచ్చినటువంటివి', అని మీరు భావించవచ్చు. కాదు, కాదు. అభ్యాసముతో వచ్చినవికావు. భయముతో యేర్పడినవి. అనగా ఆ రింగ్ మాస్టరు చేతిలోఉన్న దండమునకు భయపడి అతడికి అనుకూలముగా మెలగుతూ వస్తున్నాయి. అంతేకాని క్రూరత్వాన్ని తాము వదలలేదు. తమ చంచలత్వాన్ని తాము విడువలేదు. సన్నిహితమైన ప్రేమ భావము వాటికి కల్గలేదు. ఆవిధముగా మనముకూడా సర్కస్ మృగములవలె జీవించటము వ్యర్థమైనది. కేవలము యజమానిముందు మాత్రమే చక్కగా ప్రవర్తించటము, సరియైన ఆచరణలు ఆచరించటము, సరియైన నడతతో ఉండటము, యిది కేవలము ఒకవిధమైన మృగలక్షణముగా మనము భావించవచ్చును. సర్కస్‌లో మృగములు యీ రింగ్ మాస్టర్‌ను చూచి ఏవిధముగా భయపడుతున్నాయో అదే విధముగా యీనాడు మీరు యీ రింగ్ మాస్టర్‌ను చూసి భయపడి చేసినట్లుగా చేయకూడదు. అప్పుడు ఆ సర్కస్ మృగములకు, మీకు తేడా ఉండదు. మీలో మానసిక పరివర్తన రావాలి. మీ ప్రవర్తన మారాలి. మనసే మారకుండిన, యింద్రియములేమాత్రము వశము కావు. ఈ మనస్సు బుద్ధిని అనుసరించకుండిన, తాను యింద్రియములను యేమాత్రం అదుపులో పెట్టుకోలేదు. కనుక, మనసు బుద్ధిననుసరించి ఆ బుద్ధియొక్క ఆజ్ఞానుసారంగా ప్రవర్తించినప్పుడే యీ యింద్రియములు మన స్వాధీనమవుతాయి. 'బుద్ధిగ్రాహ్య మతీంద్రియం'. యీ యింద్రియముల

srisathyasaivahini.org / sri sathyasai vachanamrutam

తత్త్వమంతా బుద్ధికతీతమైన మార్గములో ప్రవేశపెడుతుంది. ఇలాంటి తత్త్వాన్ని మానవుడు ఈనాడు గుర్తించాలి.

**మానవత్వమునందు దివ్యత్వమనే ఆత్మతత్త్వము సుస్థిరముగా ఉంటుంది**

మానవతావిలువలను చక్కగా గుర్తించాలి. ఎందుకనగా మానవత్వము నందు దివ్యత్వమనే ఆత్మతత్త్వము సుస్థిరముగా ఉంటుంది. దీనికి రెండు ఉదాహరణలున్నాయి. గణితశాస్త్రమని ఒకటి, మిత్ర శాస్త్రమని మరొకటి ఉంది. ఈ గణితశాస్త్రములో 1+1+1+1 అనిపెడితే 4 అవుతుంది. ఒక అంకెకు యితర అంకెలు చేర్చినప్పుడు ఆ అంకె పెరుగుతుంది. ఇది గణిత శాస్త్రము. మిత్రశాస్త్రమనగా యేమంటే I+I+I+I ఇలా crores of I పెట్టండి. I అవుతుంది అంతే. ఈ I పెరగదు, తరగదు. ఎప్పటికి 'అమృతస్య పుత్రః'గా సుస్థిరమైన రీతిలో ఉంటుంది. ఎన్ని I లు చేరినప్పటికి I మాత్రమే అవుతుంది. ఈ I అనేది ఎక్కడ ఉంది? ఇప్పుడు నేను ఒక పేరు చెప్తాను. I.J నాయుడు అని పేరు చెప్పి ఎవరు మీరంటె ఒక వ్యక్తి లేచి నేను (I) అంటాడు. తదుపరి వైస్‌ఛాన్సలర్ షరాఫ్ ఎవరంటే 'I' అంటాడు, రిజిష్ట్రారు చక్రవర్తి ఎవరంటే నేను 'I' అంటాడు. కంట్రోలర్ నంజుడప్ప ఎవరంటే 'I' అంటాడు యితను. I.J నాయుడుయొక్క రూప, నామములు వేరువేరుగా ఉన్నాయి. వైస్‌ఛాన్సలర్ రూప, నామములు వేరువేరుగా ఉన్నాయి. రిజిస్ట్రార్ చక్రవర్తి రూప, నామములు వేరుగా ఉన్నాయి. కంట్రోలర్ నంజుడయ్య రూపనామములు వేరుగా ఉన్నాయి. కాని నా question కు నలుగురి వద్దనుండి 'I' అనే జవాబు ఒకటిగానే వచ్చింది. 'I' అనేది ఎక్కడవున్నదంటే I is everywhere. ఇది దేశకాల పాత్ర ప్రభావములకేమాత్రము గురికాదు. నీవు కేవలము యిండియాలో ఉన్నప్పుడే I అనవు. అమెరికాకు పో, రష్యాకు పో, చైనాకు పో యింక ఎక్కడికైన పో, పాకిస్తాన్ పోయి చేరు, I అనే అంటావు. అదే ఆత్మతత్త్వము. అది మార్పు చెందనిది, తరగనిది, పెరగనిది. ఇదే Human value, అందరియందు ఉన్న I తత్త్వము ఒక్కటియే!

**ఆత్మతత్త్వమే స్వధర్మము, దేహతత్త్వమే పరధర్మము**

ఐతే యీనాడు ఏమైపోయింది? I కి అహం చేరిపోయింది. అహంకారముతో కూడిన I గా ఉండటంచేత యిది eye గా మారిపోయింది. ఈ అహంకారము లేనప్పుడు ఏకాక్షర I

మాత్రమే ఉంది. అహంకారము చేరేటప్పటికి eye అయింది. మూడు అక్షరాల eye అయిపోయింది. ఈ మూడక్షరముల eye దేహము. ఏకాక్షర I ఆత్మ. ఈ ఆత్మ తత్త్వమే స్వధర్మము. ఈ దేహతత్త్వమే పర ధర్మము. పరధర్మము ప్రకృతికి సంబంధించినది. స్వధర్మములో దోషములు రావు. పరధర్మములో సర్వము దోషముల మయమే! కనుక, యీనాటి మానవుడు స్వధర్మమునకు సంబంధించిన మార్గములో ప్రవేశించాలంటే ఐదు రకములైన తత్త్వాలను గుర్తించాలి. ప్రకృతి సమత్వము ఒకటి. రెండవది సమాజసమత్వము, మూడవది జ్ఞానసమత్వము, నాల్గవది భక్తి సమత్వము, ఐదవది కర్మసమత్వము. ఈ ఐదింటి సమత్వాన్ని మనం గుర్తించినప్పుడే మనయొక్క దివ్యత్వమనేది మనకర్థమవుతుంది.

**శీతోష్ణములు, సుఖదుఃఖములు మానవజీవితానికి సహజములు**

మొట్టమొదట ప్రకృతి సమత్వాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ ప్రకృతియొక్క సమత్వములో ఏవిధముగా ఉన్నదంటే శీతోష్ణములు మనము అనుభవిస్తూనే ఉన్నాము. Summer లో చాలావేడిగా ఉంటుంది. Winter లో చల్లగా ఉంటుంది. చలిగా ఉంటుంది. ఈ ఎండకు, చలికి విరుద్ధమే. అయితే, ఒక సమయములో ఎండ మనకు హాయినిస్తుంది. మరొక సమయములో చలి మనకు సంతోషమును అందిస్తుంది. అనగా Summer లో చలి మనకు హాయినిస్తుంది. Winter లో మనకు వేడి హాయినిస్తుంది. ఏతావాతా యీ వేడి, చలి రెండూ మనకు సుఖాన్నే అందిస్తున్నాయి. కేవలం Time difference మాత్రమే! కనుక, మనము యీ సమత్వాన్ని ఏరీతిగా తీసుకోవాలి? వేడి మనకు ఆనందాన్ని యిస్తుంది. చలీ మనకు ఆనందాన్ని యిస్తోంది. అయితే కాలములు వ్యత్యాసంగా ఉంటున్నాయి. రెండూ మనకు హాయి నందించేవే!

మానవునికి రెండూ అవసరమే! సుఖమూ, దుఃఖము మానవునికి సామాన్యమే! ఐతే యీ సుఖదుఃఖములు దేనివలన మనకు లభిస్తున్నాయి? మరణముతో మనకు దుఃఖము వస్తోంది. జననము ఆనందము కల్గిస్తోంది. అయితే మన దుఃఖానికి మరణమా కారణము, కాదు కాదు. మరణము దుఃఖమునకు కారణమే కాదు. ఇందులోని రహస్యము మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. మరణమే కనుక నిజంగా దుఃఖాన్ని అందిస్తే అది అందరికి

srisathyasaivachanamrutam

దుఃఖమును యివ్వాలి కదా? కాని, అది అందరికి దుఃఖమును అందదించటం లేదే! లోతుగా విచారించి చూస్తే మరణముకాక, ఆ మరణించిన దేహముపైన ఉన్న అభిమానమే మనకు దుఃఖాన్ని యిస్తోంది. ఆ మరణించిన దేహము మనకేమాత్రము సంబంధము లేదనుకుంటే మనకు దుఃఖమే లేదు. నిజానికి, నీకు దుఃఖము నందించినది మరణము కాదు. మరణించిన దేహముతో ఉన్న attachment నీకు దుఃఖాన్ని అందించింది. అలాగే ఈ పుట్టిన వ్యక్తి మనకే విధముగా ఆనందాన్ని అందిస్తున్నాడు? నా కొడుకు, నా బిడ్డ, నా మనుమడు, మనుమరాలు అని ఒకవిధమైన attachment ఉన్నప్పుడు నాకు grandson పుట్టాడని ఆనందాన్ని అనుభవిస్తాడు. అట్లుకాకుండా పోతే లోకములో యెంతమందో దినానికి పుడుతున్నారు, యెంతమందో దినానికి చస్తున్నారు. ఎప్పుడూ యేడ్వడం, నవ్వటమేనా? యిది భావ్యము కాదు. ఒకే బజారులో, ఒక యింటిలో marriage మరొక యింటిలో death. ఒకరు ఆనందిస్తూ ఉంటారు, ఒకరు ఏడుస్తూ ఉంటారు. నిజంగా చావే కనుక దుఃఖము నందిస్తే అందరికి దుఃఖమునివ్వాలి కదా! యివ్వటంలేదు. ఈ విధముగా విచారించినప్పుడు ప్రకృతియొక్క సంబంధము యివన్నీ కేవలము attachment తో వచ్చినటువంటివి. సంబంధ బాంధవ్యములతో వచ్చినవి. అంతేకాని యీ జనన, మరణములు సుఖ దుఃఖముల నివ్వటంలేదనే సత్యాన్ని గుర్తించవచ్చును. ప్రాకృతమైన సమత్వాన్ని మనం యీరకముగా విచారణ చేస్తే రెండింటికి సంబంధము ఉంటోంది. ప్రకృతికేవిధముగా సుఖదుఃఖములు, heat and cold, dark and light సహజమో అట్లే మన జీవితానికికూడా యివి రెండు సహజము అనే సమత్వాన్ని గుర్తించుకున్నప్పుడు మనకు విచారణ ఉండదు.

**మానసిక సమత్వమే సామాజిక సమత్వము**

రెండవది, సామాజిక సమత్వము. సమాజము అంటే యేమిటి? ఈ సొసైటీ అనే దానికి ప్రత్యేకమైన రూపము లేదు. ఇది పంచప్రాణములతో కూడిన శరీరము కాదు. పదిమంది వ్యక్తులు చేరినదే సొసైటీ. కనుక, వ్యక్తులయొక్క సమూహమే సొసైటీ కాని, ప్రత్యేకమైన స్వరూపము కాదు. వ్యక్తిత్వములో ఉన్న దివ్యత్వాన్ని చక్కగా గుర్తించుకుంటే సొసైటీ అంతా ఆనందముగా ఉంటుంది. ఇక్కడే ఏమవుతుందంటే సమత్వము. ఈ సొసైటీలో సమత్వము

srisathyasaivachanamrutam

అభివృద్ధిపరచే నిమిత్తమై ప్రభుత్వము అనేక రకాలైన ప్లాన్లు వేస్తుంది. ఈ సమత్వము యేరీతిగా యేర్పడుతుంది? ప్రభుత్వము వేసిన ప్లానులలో అందరికి సమానంగా భూమి ఉండాలి, అందరికి సమాన ఆస్తిపాస్తులుండాలి అని ఒక ప్లాను వేశారనుకోండి! ఒకరికి పది ఎకరాల భూమి ఉంటుంది, ఇంకొకరికి రెండు ఎకరముల భూమి ఉంటుంది. వీరిద్దరిని సమానము చేయాలని వాని నాలుగు ఎకరములు తీసి రెండు ఎకరముల వానికి పంచుతాడు. అప్పుడు ఒక్కొక్కరికి ఆరు ఎకరములు సమంగా వస్తుంది. భూమిని సమంగా పంచగల్గటం అయితే ప్రభుత్వము చేశారు కాని, ఆశలు సమంగా పంచటం ఎవరితరము? కనుక desires మనము సమత్వముగా అభివృద్ధి చేసుకుంటే ప్రోపరిటీ సులభముగా సమంగా అయిపోయింది. పది ఎకరాలు ఉన్న వాని నాలుగు ఎకరాలు తీసి యింకొకరికి యిస్తే వాడు ఏడుస్తాడు. రెండు ఎకరములున్నవానికి నాలుగు ఎకరములొస్తే వాడు నవ్వుతాడు. సమత్వము ఎక్కడుంది, యిక్కడ? కనుక, మానసిక సమత్వమే సామాజిక సమత్వము. మానాభిమానాలు, దూషణ భూషణలు మొదలైన వాటిని ఈ విధమైన సమత్వములో మానవుడు కొంతవరకు నిగ్రహించుకోవడానికి ప్రయత్నించాలి. దుఃఖము వస్తే కృంగిపోవటం, ఆనందము వస్తే పొంగిపోవటం యిది మానవునికి ఉండకూడదు. ఒకడెవడో దూషించాడని యీ దూషణవల్ల మనం కృంగిపోరాదు. ఎవరో మనలని పొగిడారని మనము పొంగిపోరాదు. ఈ కృంగిపొంగని సమత్వాన్ని మనము సాధించినప్పుడే మనది నిజమైన మానవత్వముగా రూపొందుతుంది. ఈ దూషణ, భూషణలనేవి పదములయొక్క తరంగములని గుర్తించాలి. ఒకరు కాదు అనవచ్చును. ఇంకొకరు అవును అనవచ్చును. ఈ 'కాదు, అవును' లు మననోటికే కాని సమత్వానికి సంబంధము లేదు. ఈ సమత్వము ఎక్కడుండాలి? మనయొక్క conscience లో ఉండాలి. దీనిని మనము తృప్తి పరచినప్పుడు సరైన సమత్వము వస్తుంది. మనలో ఏవిధమైన దోషములు లేనప్పుడు ఎవరేవిధముగా నిందించినా మనము వెరువనక్కరలేదు. మనలో మంచి లేనప్పుడు ఎవరెంత వర్ణించినా మనము పొంగిపోరాదు. నీది నీకు తెలుసును బాగుగా! నీ సత్యాన్ని నీవు గుర్తించి వర్తించుకోటమే సమాజముయొక్క సమత్వము.

**ఏకత్వమును నిరూపణ చేయడమే జ్ఞానము**

srisathyasaivachanamrutam

ఇంక జ్ఞానముయొక్క సమత్వము. జ్ఞానమనగా ఏమిటి? 'అద్వైత దర్శనం జ్ఞానం', అన్నారు. ఏకత్వాన్ని నిరూపణ చేయటమే జ్ఞానము అన్నారు. అన్నింటియందూ ఉన్న ఏకత్వమే unity in diversity. ఇక్కడ భేదత్వమే ఉండదు. ఏవిధముగా అంటే అందరియందు దైవత్వము ఒక్కటే! అందరూ పీల్చుకునేగాలి ఒక్కటే! అందరూ త్రాగే నీరు ఒక్కటే! అందరూ నివసించే భూమి ఒక్కటే. అందరి తలపైనా ఉన్న ఆకాశము ఒక్కటే! ఇంక భేదము ఎక్కడ ఉంది? మన హృదయాలలో ఉన్న ఆత్మకూడా ఒక్కటే! ఈ భేదములంతా కేవలం మనో సంకల్పములతో ఏర్పడినవే గాని, సృష్టి సహజమైనవి కావు. 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ' అనే సత్యాన్ని మనము గుర్తించుకోవాలి. మన క్లాసు పిల్లలతో యేమో తర్కించుకుంటూ ఉంటాము. మాటకు మాట, పైన కోపాలు మనము అభివృద్ధి చేసుకోకూడదు. వినయ విధేయతలు ప్రకటిస్తూ రావాలి. మన యింటిలో పెద్దలుగాని కళాశాలలో లెక్చరర్లుగాని ఎవరైనా యేదైనా చెప్తున్నప్పుడు Yes జీ, No జీ అని మంచిగా మాట్లాడుతూ ఉంటే ఎంత ఆనందము యిస్తుంది! ఈవిధమైన మాటలు, వినయముతో విధేయతతో మనము ఉపయోగపెట్టినప్పుడు సమత్వము మనలో చక్కగా అభివృద్ధి అవుతుంది. ఎటువంటి పరిస్థితులలోనైన మాటలు చాలా మృదుమధురముగా ఉపయోగ పెట్టుకొనే విధానాన్ని నేర్చుకోవాలి. ఎవరైనా మనలను దూషిస్తున్నారనుకోండి. యిది చక్కగా మీరు జ్ఞాపకమునందుంచుకోవాలి, 'భగవంతుడే యీ రూపములో వచ్చి నన్ను దూషిస్తున్నాడు. కనుక యిది ఆనందమే', అని ఆరీతిగా భావించుకో! ఎవరైనా వచ్చి నిన్ను వర్ణిస్తున్నారంటే 'భగవంతునికెంత దయ! యీరూపములో వచ్చి నన్ను వర్ణిస్తున్నాడని', నీవు ఆనందించు. ఏ వ్యక్తి నిన్ను దూషించినా భూషించినా 'భగవంతుడే యీ రూపములో వచ్చి నన్ను యీ విధముగా వచ్చి సరిచేస్తున్నాడ'నే సమభావాన్ని తీసుకుంటే యెంతైనా మన మనసు నిగ్రహములోనికి ప్రవేశిస్తుంది. ఉద్రేకముల కేమాత్రము అవకాశము యివ్వరాదు. ఈ ఉద్రేకములు నీయొక్క బలహీనతలే! నీ బలహీనతను నీవు నిరూపించుకుంటున్నావు. మనయందు అహంకారమునకు గాని, క్రోధమునకు గాని, యింకేవిధమైన దుర్భావములకు గాని అవకాశము యివ్వరాదు. యిదంతా సంయమనంతో మనకు సమకూరుతుంది. కనుక, మొట్టమొదట మనస్తత్వాన్ని మనం చక్కగా అర్థము చేసుకోవాలి. 'సంకల్ప వికల్పాత్మకం మనః' అన్నారు. 'మననాత్మకం మనః' అన్నారు. మనయొక్క thoughts మనకు ఉద్రేకాన్ని గాని, ఉల్లాసాన్నిగాని



srisathyasaivachanamrutam

అందిస్తున్నాయి. కనుక, మనలో మొట్టమొదట మంచి తలంపులు పెంపొందింపచేసుకునేందుకు ప్రయత్నించాలి. ఈ విధముగా అందరియందు ఉన్న దైవత్వము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించుకుంటే ఉద్రేకాలకు అవకాశము లేదు. ఇదే జ్ఞాన సమత్వము.

**భగవంతుడొక్కడే; రూప, నామములు వేరుగా ఉండవచ్చు**

ఇక, భక్తి సమత్వము. భగవంతుడు ఒక్కడే, అనేక రూపనామములు ఉండవచ్చు. 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. ఉన్నది ఒక్కటే, అయినా అనేకమంది అనేక పేర్లు పెడుతున్నారు. 'ఏకమేవ అద్వితీయం'. ఒక్కటే! ఒక్కటిగాని రెండు లేవు. ఇలాంటి భావముచేత భగవత్ తత్త్వము ప్రేమతో పొందటానికి ప్రయత్నించాలి. ప్రేమస్వరూపము ఒక్కటే ఒక్కటి. నా ప్రేమ, నీ ప్రేమ, యింకొకరి ప్రేమ ఒక్కటే! దానియొక్క స్వభావము ఒక్కటే. చక్కెర నా చేతిలో పెట్టుకున్నా, నీచేతిలో పెట్టుకున్నా, యింకో servant చేతిలో పెట్టుకున్నా దాని తీపిగుణము తీపి గుణమే! చేతులు మారినంత మాత్రమున తీపి మారదు. ఒక చంపకపుష్పము మన చేతిలో పెట్టుకొని వాసన చూస్తున్నాము. Right hand లో పెట్టుకొని చూచినా దాని సుగంధము సుగంధమే, ఎడమచేతిలో పెట్టుకున్నా దాని సుగంధము సుగంధమే! అంత మాత్రమే కాదు, ఆ సుగంధాన్ని మనకందించటమే కాకుండా మన పరిసరములలో ఉన్నవారికికూడా అందిస్తుంది. భక్తులకు కష్టములు, దుఃఖములు, బాధలు సంభవిస్తుంటాయి. ఆ దుఃఖములలోకూడా మనము ఆనందమునందించాలి. మనదేహము క్షీణించి పోతున్నా మనము ఆనందము నందించాలి. దీనిని ఊదొత్తితో పోల్చవచ్చును. అది ఎలా అంటే, అది కాలిపోతూ కాలిపోతూ సుగంధాన్ని అందరికి యిచ్చి కాలిపోతుంది. మరొకటి గంధపు చక్క. ఆగంధపు చెక్కను పట్టి నూరినూరి దానినెంత హింసించినా దాని సుగంధమును అభివృద్ధి గావిస్తుంది. యీనాడు మానవుడొక్కడే ఈ రీతిగా తయారౌతున్నాడు. ఒక చీమకంటె, ఒక కాకికంటె మరింత దిగజారిపోతున్నాడు. మీరు చూసి ఉంటారు. ఎక్కడైనా తీపి ముక్క బెల్లమో, చక్కరో పడి ఉంటే ఒక చీమ చూస్తుంది. 'భలే నాకు బెల్లం చిక్కింది' అని ఆ చీమ స్వార్థముగా ఆరగిస్తూ కూర్చోదు. తన చీమల పుట్టకు పోతుందది. అక్కడ బెల్లము ఉంది అందరము పోదామురండి అని చెప్పి ఆ బెల్లమును అందరు సమంగా భుజిస్తాయి. ఎక్కడైనా

srisathyasaivachanamrutam

అన్నం మెతుకులు చల్లి test చేయండి. మొదట ఒక కాకి వస్తుంది, చూస్తుంది. అది తినదు. పోయి 'కావు, కావు' మని ఇతర కాకులన్నింటిని ఏకంగా పిల్చుకుని వచ్చి అన్నీ ఏకంగా భుజిస్తాయి. నిజముగా యీ విధమైన సమత్వం మానవునియందు ఉండిఉంటే మానవజాతి ఎంత ఉద్ధారమై ఉండేది! మానవుడు తనకేదైనా చిక్కిందంటే ఎవరైనా చూస్తారేమోనని మెత్తగా తీసుకొని లోపల పెట్టుకుంటాడు. ఏం! పది మందికి యిందులో అధికారముఉంది, పది మంది తిన్నప్పుడే నేనూ తిన్నట్లు, అనే సమత్వాన్ని యీ భక్తి భావములో అభివృద్ధి పరచుకోవాలి. అందువల్లనే ప్రాచీన సంప్రదాయమునందు 'లోకాస్సమస్తా సుఖినోభవంతు', అని విశాలమైన భావముతో భక్తి ప్రపత్తులను ప్రసరింపచేస్తూ ప్రార్థించడం ఉన్నది.

**చేతినిండా పనిలేకపోతే మనస్సంతా పిచ్చిభ్రాంతులతో నిండిపోతుంది**

ఈనాడు మన భావాలంతా చాలా అపవిత్రముగా మారిపోతున్నాయి. మీకందరికి తెలుసు. ఇనిస్టిట్యూట్‌లోగాని, హాస్టలులోగాని టైట్‌గా మీకు పనులు పెడుతున్నారు. ప్రతివారం ఏదో ఒక టెస్ట్ అనో క్విజ్ అనో అనేక రకాలుగా మీకు వత్తిడి పెడుతున్నారు. ఇది కొంచెం ముగించుకొని అక్కడకు పోతూనే స్పోర్ట్స్, గేమ్స్‌కి పోవాలి. అక్కడనుండి పోతూనే వీరికి స్నానం చేసే టైమ్‌కూడా ఉండదు. అక్కడ kitchen లో పని చేయాలి. మీరు అనుకుంటారు, "అబ్బా! స్వామీ! హాస్టలులో మాకు టైమే లేదు చాలా టైట్ వర్కు యిస్తున్నారు. స్టడీకూడా చాలా కష్టంగా ఉందని మీరు భావిస్తారు. This is good for you. ఎలానంటే ఒక చిన్న ఉదాహరణము: 'బ్రహ్మచారి శతమర్కటః' అన్నారు. ఈ యువకుల లోపల వేలకొలది కోతులుంటాయట! అలాంటి మర్కట భావాలున్నప్పుడు వాటిని అరికట్టుకోటం చాలా కష్టము. మరొక చిన్న కథ చెప్పి ముగిస్తాను.

పల్లెలో నివసించే ఒక యువకుడు దేశాభిమానంచేత, నేను సైన్యంలో ప్రవేశించాలని ఉత్సాహముతో ప్రవేశించాడు. రెండు మూడు దినములు అక్కడ టైట్‌గా పనిపెట్టారు. ఇంతలో దురదృష్టవశాత్తూ ఇతడు అక్కడకు పోయిన ఐదవ రోజునే యుద్ధం నిల్చిపోయింది. ఏదో యింటిలో బాధవల్లనో, దేశాభిమానమువల్లనో, యింకేవిధమైన కారణమువల్లనో యుద్ధములో ప్రవేశించాలని తల్లితండ్రులను అక్కాచెల్లెండ్రను అందరిని త్యజించి తాను యుద్ధములో



srisathyasai vahini amrutam

ప్రవేశించాడు. యుద్ధము అయిపోయింది. సిపాయిలకు రెస్ట్ చిక్కింది. వీడు చెట్టుక్రింద కూర్చున్నాడు. గత మూడు దినములనుండి యేమీ యోచనకు టైమ్‌లేదు వానికి, పని, పని! ఇక్కడ డ్రిల్ చేయటం, అక్కడనుండి shooting కి పోవటం, అన్నీ పనులే! 24 గంటలూ పనిపెట్టారు. ఈ పని నిలచిపోయేటప్పటికి చెట్టుక్రింద కూర్చున్నాడు. "నాగురించి నాతల్లి తండ్రులెంత బాధపడుతున్నారో, నా చెల్లెళ్లు యెంత బాధపడుతున్నారో, నా తమ్ముడు యేవిధముగా ఉన్నాడో", అని యింటిని గురించి చింత అభివృద్ధి అయింది. ఈ చింతలకంతా కారణం పని లేకపోవటం! అక్కడ కూర్చున్న ఈ సైనికుని ఒక officer చూశాడు. వాడు తన వాళ్ళను తలచుకుంటున్నాడు, కన్నీరు కారుస్తున్నాడు. అధికారి పిలిచాడు, 'బాబూ! యిలారా',అన్నాడు. ఒక దగ్గర చూపించి నాలుగు అడుగులు యిట్లా, నాలుగు అడుగులు అట్లా ఒక గుంత తవ్వమన్నాడు. మంచి గట్టి ప్రదేశములో గుంట తవ్వమని చెప్పాడు. అది తవ్వడానికి మూడు దినములు పట్టింది. రోజస్తమానం తవ్వటం, తవ్వటం, యీ విధముగా పాపం శ్రమ పడ్డాడు. మూడు దినములయ్యాక officer దగ్గర కొచ్చి 'సార్! నాపని పూర్తయింద'ని చెప్పాడు. ఈ గుంట తవ్వేటప్పుడు నీవు ఎన్ని పర్యాయములు యింటిని గురించి చింతించావని ప్రశ్నించాడు. 'నాకు టైమ్ ఎక్కడుంది సార్! దీనితో సరిపోయింది. ఇంటి సమాచారమే నాకు జ్ఞాపకం రాలేద'న్నాడు. అప్పుడు అధికారి చెప్పాడు, 'ఈనాటి పిల్లలకు పనిలేకుండా పోవటంచేతనే మనస్సంతా పిచ్చిభ్రాంతులతో నిండి పోయింది' అని.

### పనిచేయని వ్యక్తి తుప్పుపట్టిన యంత్రమువంటివాడు

పిల్లలకు ఎక్కువగా పనిపెట్టాలి. యీ పనివల్ల నీవు అలసిపోయినా ఫరవాలేదుగాని చెడు భావాలు నీలో చేరకుండా ఉంటాయి. బయటి కళాశాలలలో పనులు లేకుండా పోవటంచేతనే అనవసరంగా ప్రపంచ విషయాలలో మునిగిపోయి బజారులో పడుతున్నారు. ఇక్కడ work is worship. అదే కర్మసమత్వము. Work, work నాకు work కావాలి అనే ఆవేదన రావాలి, లోపలనుండి. అదే కృష్ణుడు చెప్పింది: "ఒరే పిచ్చివాడా! కర్మ చాలా మనకు పవిత్రమైన వ్యూహాలను పెంపొందింప చేస్తుంది. నాకు కర్మచేయవలసిన అవసరము లేదు. నాకీ ప్రపంచములో కావలసినది యేమీ లేదు. పోయేదేమీ లేదు. కానీ నేనే యీ కర్మ

sri sathyasai vahini amrutam

ఆచరిస్తున్నాను. దేనికోసం? లోకోద్ధరణ నిమిత్తమై. నేను కర్మ ఆచరించినప్పుడే లోకము ఆచరిస్తుంది. కర్మలోనే మనకు అధికారము ఉంటుంది", అని. కొంతమంది ఈనాడు లోకములో యేమనుకుంటారు? పనిలేకుండా హాయిగా కూర్చొని నిద్రపోతుంటే 'అబ్బా! వాడెంత అదృష్టవంతుడురా! ఏ పనీ లేదు. చక్కగా భోజనము చేసి నిద్రపోతూ ఉంటాడు. ఇలాంటి అదృష్టము ఉండాలి', అంటారు. ఇది అదృష్టము కాదు. దురదృష్టము. సోంబేరితనము. పని చేయాలి. రెక్కాడితే డొక్కలాడుతాయి. నీవు పనిచేసినప్పుడే నీవు తిన్నది జీర్ణమవుతుంది. అలా పనిచేయకపోతే మీకు తెలుసు, machines ఉంటాయి, అవి పనిచేయకుండా అలా పెడితే తుప్పుపట్టిపోతాయి. ఈ విధంగా rust పట్టినప్పుడు ఆ machines యింక పనిచేయవు. మొట్టమొదట dust మాదిరి చేరుతుంది. ఈ dust లో గాలి చేరటంవలన rust అయిపోతుంది. ఈ rust పట్టటంవలన తనపని burst అయిపోతుంది. ఈ burst అయినప్పుడే వాటిని rest లో ప్రక్కగా పెట్టేస్తాము.

పని చేయనివ్యక్తి ఎలాంటి వాడంటే rust పట్టిన machine వంటివాడు. కనుక, మనము పనిచేయాలి. బాగా పనిచేస్తూ ఉంటే మనకు రోగములేమాత్రము రావు. దీనివలన, మానవునిలో బుద్ధికుశలత పెరుగుతుంది. అంతేకాదు, దేహానికి ఆరోగ్యము చేకూరుతుంది. చాలా clever గా ఉంటాడు. Memory power పెరుగుతుంది. దేహము పుష్టివంతమవుతుంది. చెడ్డ భావాలను లోపలకు రాకుండా చూసుకుంటుంది. ఈ thoughts లోపల చేరేకొద్ది young age లోనే old age ప్రారంభమవుతుంది. మన oldage కు కారణము thoughts. చాలా మంది పిల్లలను చూడండి. ఈ పిల్లలెలా ఉండాలి? పిల్లలను తీసుకువెళ్ళి గుండుకేసి కొడితే గుండుపగిలి పోవాలి. అలా ఉండాలి, వారిశక్తి. కానీ అలాలేరు. చిన్నపిల్లలు 14 సంవత్సరములు, 16 సంవత్సరములు పిల్లలెలా అయిపోయారో! ఎంతపుష్టిగా, సంతుష్టిగా ఉండాలి! ఇదే నిజమైన శరీరపటుత్వము. కనుక, healthy గా wealthy గా తయారవాలంటే మీరు పనిచేయాలి. ఈ పనిలోపల యింద్రియ నిగ్రహము పెంచుకోవాలి. అదియే మన యోగము. 'యోగః చిత్తవృత్తి నిరోధకః', ఇంద్రియాలను నిగ్రహించుటయే యోగమన్నారు. ఇంద్రియముల నిష్టము వచ్చినట్లు ప్రవేశపెట్టటం భోగము అన్నారు. ఈ భోగమువల్ల మనకు రోగము వస్తుంది. అలా రోగము రాకుండా చూసుకుందాం. మనం కొంతకాలము చదవాలి, కొంతకాలం ఆడాలి, కొంతకాలం

srisathyasaivahini.org

పాడాలి. కొన్నిసేవలు చెయ్యాలి. ఈ విధముగా యువకులు మంచిగా అభివృద్ధియై పోయినప్పుడు మనము యే మిలట్రీలోను చేరనక్కరలేదు. మిలట్రీ ట్రయినింగులో ప్రతిఒక్కరు నేర్చుకోవలసినవి రెండు ఉన్నాయి. ఒకటి పెరేడ్, రెండవది గన్‌షూటింగ్. యివి రెండూ మిలట్రీలో అందరికీ దోభీకి, బార్బర్‌కు, వాచ్‌మన్‌కుకూడా ప్రతీ ఒక్కరికి తెలిసి ఉండాలి.

అదేవిధముగా యీ జగత్తులో మనం దుష్ట గుణములతో యుద్ధము చేయటానికి రెండు తెలిసి ఉండాలి. అవే దైవప్రీతి, పాపభీతి. ఈ రెండూ ఉంటే నీవెక్కడైనా రాణిస్తావు. ఇవి రెండూ Human values, పాపభయము ఉన్నప్పుడే నీవు పాపములో ప్రవేశించవు. దైవప్రీతి ఉన్నప్పుడే నీవు దుఃఖానికి గురికావు. ఎందుకంటే దైవప్రేమ నీకు నిండుగా, దండిగా ఉంది.

విద్యార్థులారా! మీ చదువులతోబాటు, మీప్రవర్తనతోబాటు, మీ ఆలోచనలతోబాటు యీ దైవప్రీతి, పాపభీతిని పెంచుకొని దేశానికి ఆదర్శవంతమైన మూర్తులుగా మీరు తయారౌతారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నాప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ. 23-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam